
# కనకరాజు కథ కంచికి

- కొడమర్తి శ్యాంప్రసాద్



గ్రాఫిక్స్: భాస్కర్

**ఊరి మొదట్లో రావిచెట్టూ, వేపచెట్టూ ఒకేచోట కలిసి ఏపుగానే ఎదుగుతున్నాయ్. వాటి చుట్టూ కట్టిన రచ్చబండ మీద కనక రాజు ఒక్కడే కూర్చుని ఉన్నాడు.**

వాణ్ణి ఉత్తి కనకరాజు అని ఎవరూ అనరు. కథల కనకరాజు అంటారు. ఉదయం నుండి మధ్యాహ్నం భోజనాల వరకు, అలాగే భోజనా లయ్యాక వచ్చి రాత్రి చీకటి పడేవరకు అందరూ కాలక్షేపం కోసం ఆ రచ్చబండ దగ్గరికే చేరతారు. 'ఏరా కనకరాజూ! ఏమీ తోచడం లేదు. ఓ కథ మొదలెట్టరాదూ!' అంటారు ఎవరో ఒకళ్ళు. మిగిలిన వాళ్ళు వంత పాడతారు. 'సరే కాదనేదేముంది' అనుకొని 'ఏం కథ చెప్ప మంటారు? పౌరాణికమా! జానపదమా! అదీ ఇదీకాక సాంఘి కమా?' అంటూ జనానికే ఎంపిక ఛాన్స్ ఇస్తాడు. కొందరు పౌరాణిక మంటారు, మరికొందరు జానపదమంటారు. మాటామాటా పెరిగి గొడవలు జరిగిన సంఘటనలు కూడా ఉంటుంటాయి ఆ రచ్చబండ దగ్గర. మొత్తం మీద కనకరాజే వాళ్ళందరికి సర్ది చెప్తాడు ఆ సమ యంలో.

'ఆగండహే! కథలకోసం కొట్టుకు ఛస్తారేమిటిరా! కాస్తంత ఓపికపట్టి కూర్చున్నారంటే మీకే కథ కావాలంటే ఆ కథే చెప్తాను కదా!' అంటాడు.

'సరే నీ ఇష్టమైంది ఏదో ఒకటి నువ్వే చెప్పు. ఎందుకంటే నేనో టంటే ఆ మునసబు కొడుకు ఇంకోటంటాడు! మాకు ఈ జన్మలో పడిచావదు కాని నువ్వు కానియ్' అంటాడు పాత ప్రెసిడెంట్ మనవడు.

''ఏ కథైనా చెప్పుకొని సాంఘికం పేరెట్టి మొన్న చెప్పిన సూరిబాబు కథ మాత్రం చెప్పమాకు! ఎందుకంటే నువ్వు చెప్పినంత సేపూ బాగా విని, నువ్వెళ్ళిన తరువాత ఒకటే గొడవ పెడతాడు. మొన్న చెప్పిన కథ బాగానే ఉంది కాని తన పాత్రకి ఆ మునసబు మూడో కోడలికి లింకుపెట్టి, తనగుట్టంతా రట్టు చేస్తున్నావని ఒకటే బాధపడిపోయాడు.

అందుకని ఈసారికి ఆ సూరిగాణ్ణి ఒదిలెయ్'' అన్నాడు చలమయ్య కాలుస్తున్న చుట్టను దూరంగా విసిరి సర్దుకు కూర్చుంటూ.

కనకరాజు కథ చెప్తుంటే ఒక వేళ కొంచెం లేటయినా ఎవరూ భోజనానికి తొందరపడరు. 'ఇదైన తరువాత చూద్దాంలే' అని కదల కుండా అలాగే కూర్చుంటారు. కనికరించి ఎప్పుడైనా కనకరాజే 'వెళ్ళి భోజనాలు చేసిరండి మిగిలింది తర్వాత చెప్తా'నంటాడు.

ఇలా కనకరాజు కథలకి రచ్చబండ దగ్గర చాలా ఏళ్ళే డిమాండు నడిచింది. రానురాను ఆ ఊళ్ళో కూడా మార్పులొచ్చాయి. ఆ ఊరికి కరెంటు రావడం కూడా మన కనకరాజు కథలకి కొత్త షాకునిచ్చింది. ఎలా అంటే - ఆ ఊరి ప్రెసిడెంటు కొడుక్కి కనకరాజంటే కడుపు మంట. పంచాయతీ ఎలక్షన్లప్పుడు తమ తరపున ప్రచారం చెయ్యమని కనకరాజుని ఎంత బతిమాలినా మాట వినలేదని మనసులో కోపం పెట్టుకున్నాడు.

'వీడిని సమయం చూసి దెబ్బ కొట్టా'లని ఎదురు చూస్తున్నాడు. ఆ ఊరికి కరెంటు రావడంతోనే పంచాయతీ భవనానికి రేడియో తెప్పించాడు.

రచ్చబణ్ణడ దగ్గర రసకంథాయంగా కనకరాజు కథను నడుపుతుంటే 'పానకంలో పుడకలా' పంచాయతీ రేడియోని గట్టిగా పెట్టించి కథా గమనానికి ఆ ప్రెసిడెంటు కొడుకే ఆటంకం కలిగించే వాడు. కొంతకాలం ఆ విషయం మీద గొడవలు జరిగాయి. కొంత మంది 'మాకు ఆ రేడియో గోల వద్దు, ఏమీ వద్దు. కనకరాజు కథే కావాలి. వాడి కథ ముందు ఈ రేడియోలో పాటలు, పద్యాలు దిగదుడుపే' అనేవారు.

మరికొంత మంది యువకులు 'ఎంతసేపూ ఈ కనకరాజు గాడి కథలేనా? వట్టి పల్లెటూరి గబ్బిలాల్లా ఇలాగే ఉండిపోతారా? మన ఊరికి కొత్త కళ రావాలంటే రేడియో కార్యక్రమాలు, సినిమా పాటలు కూడా కావలసిందే' అనేవారు.

వీళ్ళని వాళ్ళని కూడా బుజ్జగించే ప్రయత్నంలో భాగంగా కనకరాజు కథలకి, రేడియో పాటలకి కూడా తగిన సమయాన్ని కేటాయించే వారు ఆ ఊరి పెద్దలంతా కలిసి. ఇలా కొన్నాళ్ళు నడిచింది.

రచ్చబండ దగ్గర కనకరాజు కథకి జనాదరణ తగ్గలేదు కాని సమయం తగ్గిపోయింది. ఇంతలో మరో ప్రమాదం ముంచుకొచ్చింది. ఆ ఊరిప్రక్క గ్రామంలో ఎవరో ఒక మోతుబరి రైతు విపరీతపు ఆలోచన చేశాడు. క్రిందటేడాదే ఆ మోతుబరి రైతు తన ఏకైక పుత్రుడికి పట్నం అమ్మాయితో ఘనంగా పెళ్ళి జరిపించాడు. ఆ పుత్రరత్నానికి పెళ్ళాం మోజుతోబాటు పట్నం మోజు కూడా బాగా పెరిగింది. తరచూ పట్నానికి పోవడం, సినిమాలు, షికార్లు చేసిరావడం! ఇలా కొంతకాలం నడిచేసరికి ఆ మోతుబరి కొడుక్కి పట్నంలో ఎవరో ఒక వింత కోరికని మనసులో బాగా నాటారు.

'పల్లెటూళ్ళో ఏంపడి వుంటావ్? డబ్బున్న వాడివే కదా! పట్నానికి వచ్చి ఏ సినిమా హాలో కట్టించుకుంటే జల్సాగా బతకవచ్చు కదా!' అన్నారు.

ఆ మాటలు అతగాడి కొత్త పెళ్ళానికి కూడా బాగా నచ్చాయి. పట్నంలోనే ఉండిపోవచ్చు కదాని బుద్ధిపుట్టి తన కొత్త మొగుణ్ణి తన మోజును అడ్డం పెట్టుకొని బాగా ఊదరకొట్టింది.

ఆ దెబ్బతో ఆ మోతుబరి కొడుకు తన ఆస్తి పంచియ్యమని, పట్నంలో తన బతుకు తాను బతుకుతానని తండ్రితో గొడవపడ్డాడు.

'ఏమయిందిరా నీకు? నిక్షేపంలాంటి ఊరొదిలిపెట్టి ఆస్తి తెగ నమ్ముకొని పట్నం పోతానంటా వెందుకురా నా కొడకా?' అని గోలచేసి

'నీకేం కావాలో చెప్పు. కొండమీది కోతినైనా ఈ ఊరికే తీసుకొస్తానన్నా'డు మోతుబరి.

తన ముద్దుల కొడుకును బుజ్జగిస్తూ వాడి మనసులో నాటుకున్న సినిమాహాలు కోరికని గుర్తించి 'ఓసి ఇంతేకదా! ఆ సినిమా హాలేదో మనూరిలోనే కట్టిద్దాం. ఇక్కడుండే ఆ యాపారమేదో నువ్వే చూసుకో! ఈమాత్రం దానికి ఉన్న ఊరొదిలిపెట్టి, పట్నం పోవడమెందుకురా నా బుజ్జి నాన్నా!' అని బుజ్జగించి ఆ ఊళ్ళో బ్రహ్మాండంగా ఓ సినిమా హాలు కట్టించాడు ఆ మోతుబరి.

అలా ఆ పక్క ఊళ్ళో సినిమా హాలు బయలుదేరడంతో కనకరాజుకి, ఆ రచ్చబండకి పెద్ద సమస్యే ఎదురయ్యింది. ఉదయం ఆటకి, మధ్యాహ్నం మ్యాట్నీకి, రాత్రి రెండు ఆటలకి జనం విపరీతంగా ఎడ్లబళ్ళు కట్టుకొని మరీ చూసి రావడం మొదలెట్టారు.

'కొత్త వింత కదా! తర్వాత కొన్నాళ్ళకైనా మళ్ళీ రచ్చబండ కళకళలాడకపోతుందా?' అని కొన్నాళ్ళు కనకరాజు ఆశగా ఎదురు చూశాడు. ఈ సినిమా జాడ్యం అలా జనాన్ని ఆవహించేస్తుంటే దాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియలేదు కనకరాజుకి.

ఇప్పుడింక కదలలేని ముసలి, ముతక జనం మాత్రమే రచ్చబండ దగ్గర చేరుతున్నారు. అదైనా వాళ్ళ ఆరోగ్యాలు బాగుంటేనే! ఇలా కనకరాజు కథలకి జనం పల్చబడిపోయారు. కనకరాజు కథల మీద ఆ దేవుడే పగబట్టాడో ఏమో ఆ ఊరికి ఒక వి.డి.ఓ కొత్తగా వచ్చాడు. వస్తూనే ఊరి జనాన్ని ఆశ్చర్యంలో ముంచేశాడు. ఆ వార్త విన్న రచ్చబండ, రావిచెట్టు కూడా గజగజలాడిపోయాయి.

'ఇంక మనకి కనకరాజుకి కూడా కాలం చెల్లింది' అనుకున్నట్టుగా రావిచెట్టు కూడా భయంతో తన చిగురుటాకుల్ని ఎడాపెడా ఊపేస్తోంది.

ఇలా వస్తున్న కొత్త మార్పులు కనకరాజు జీవితంలో కలకలం పుట్టిస్తున్నాయి.

ఆ రావి చెట్టు కొమ్మమీద వాలిన కాకి కాకా అంటూ అరుస్తూ గేలి చేస్తున్నట్లుంది. ఒంటి కన్నుతో కనకరాజుని చూస్తూ రెట్ట వేసి మరీ రెచ్చగొట్టింది.

రచ్చబండ మీద మహారాజులా వెలిగిన కనకరాజు, తనపై పడ్డ కాకిరెట్టను ఎడం చేత్తో తుడుచుకొని, ఇంక తనకి స్థానభ్రంశం తప్పదని పక్కకి జరిగి కూర్చున్నాడు. ఆ పక్కనే ఉన్న గ్రామ కచేరీ దగ్గర చేరిన కొందరు కుర్రాళ్ళు కొత్త విడిఓ తెచ్చిన టివి గురించే మాట్లాడుకుంటున్నారు. కనకరాజుకి కూడా ఆ వింత వస్తువు పట్ల కుతూ

హలం పెరిగి వాళ్ళ మాటలు శ్రద్ధగా వింటూ కూర్చున్నాడు.

ఇంట్లో కూర్చునే ఎన్నో ప్రోగ్రాములు చూడవచ్చని తెలిసి హతాశుడైపోయాడు. ఒక్కసారి ఒంట్లో ఉన్న రక్తాన్ని ఎవరో ఎత్తుకు పోయినట్లు బాధపడిపోయాడు.

ఎండిన వేపకొమ్మ అదే సమయంలో గాలికి కదిలి ఫెళఫెళ శబ్దం చేస్తూ విరిగి రచ్చబండమీద పడిపోయింది.

అక్కడ కనకరాజు తప్ప ఇంకెవరూ చేరడం లేదు. పక్క ఊరి సినిమా బండివాడు జాలిగా చూసి

'పాపం కనకయ్య మావ ఒంటరిగా కూర్చున్నాడని కాలక్షేపంగా ఉంటుంది చదువుకొమ్మని' రెండు సినిమా పేపర్లు ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ ఊరి పాత కరణం లింగరాజు పెద్ద కొడుకు ప్రయోజకుడయ్యాడు. తన తండ్రికి కరణీకం ఉద్యోగం పోవడంతో పొట్టచేత పట్టుకొని పట్నం వెళ్ళి ఒక ప్రెస్సులో పనికి కుదిరాడు.

కొన్నాళ్ళు అలా పని నేర్చుకొని కూటికి గుడ్డకి ఇబ్బంది లేకుండా సంసారాన్ని నెట్టుకొచ్చాడు. కష్టపడి రోజుకి ఇరవై గంటలు పనిచేసి నాలుగు రాళ్ళు వెనకేసుకున్నాడు. ఒక పాత ప్రెస్సు అమ్మకానికి వస్తే దాన్ని కొని, తన అనుభవంతో బాగుచేసి వాడకంలోకి తీసుకొచ్చాడు. ఇలా తన ప్రెస్సు ద్వారా పుస్తకాలు, పత్రికలు అచ్చు వేయించే స్థితికి చేరుకోగలిగాడు.

అలాంటి లింగరాజు కొడుకు తన స్వగ్రామంలో తండ్రి అంత్యక్రియలకి వచ్చాడు. కర్మకాండ అంతా యథావిధిగా జరిపించి, దాన ధర్మాలు కూడా దండిగానే చేశాడు. అదేరోజు బయటికి వెడుతూ రచ్చబండ మీద ఒంటరిగా కూర్చున్న కనకరాజుని చూసి

'మీరు కథల కనకరాజు గారు కదూ!' అంటూ పలకరించాడు.

'ఔను బాబూ! ఈ కనకరాజుని నువ్వింకా కథల కనకరాజుగా జ్ఞాపకం ఉంచుకున్నావా బాబూ!' అంటూ అతని చేతులు పట్టుకొని దగ్గరికి తీసుకున్నాడు. 'నేనింకా జ్ఞాపకం ఉన్నానా బాబూ!' అన్నాడు.

'మిమ్మల్నెలా మరిచిపోతానండీ! ఈ రచ్చబండ, ఈ రావిచెట్టు కింద మీరు నాకు ఎప్పటికీ జ్ఞాపకమే! నేను ఆడింది, పాడింది ఈ రచ్చబండ దగ్గరే! మీ కథలే నాకు లోకాన్ని గురించి నేర్పాయి. అనాథల మైపోయిన మాకు మీ కథలే ధైర్యాన్నిచ్చాయి' అంటూ ఎంతో ఉద్వేగంతో మాట్లాడాడు ఆ లింగరాజు కొడుకు.

'ఔను! నీ పేరు బసవరాజు కదూ! ప్రయోజకుడు వయ్యావన్న మాట! మీ నాన్నని ఘనంగానే సాగనంపావు. వృద్ధిలోకి వస్తావు బాబూ' అంటూ దీవించాడు కనకరాజు.

ఊళ్ళో ఒంటరిగా కాలం గడుపుతున్న కనకరాజుని చూసి 'ఔను మీరు మాతో పట్నానికి ఎందుకు రాకూడదు? ఇక్కడ మాత్రం మీకెవరున్నారని' అంటూ కనకరాజుని పట్నానికి రమ్మని తన దగ్గరే ఉండవచ్చని ఆహ్వానించాడు బసవరాజు.

పోనీలే కాలంతోపాటు మనిషీ కదలాలనుకొని సరేనన్నాడు కనకరాజు.

పట్న వాసమంతా కొత్తగా ఉంది. రచ్చబండ గుర్తుకి వచ్చి నప్పుడల్లా కనకరాజు కళ్ళల్లో కన్నీళ్ళు ఊరేవి.

ఒక రోజున ఖాళీగా కూర్చున్న కనకరాజుని చూసి బసవరాజు,

''ఏమండీ! మీరు ఎంతో కాలంగా కథలు చెప్తున్నారు. ఎంతో అనుభవం గడించారు. ఇలా వృథాగా గడపడం దేనికి? నా దగ్గరే ఘోస్టు రైటరుగా ఎందుకు ఉండకూడదు! మీలాంటి పెద్ద వాళ్ళ అనుభవాన్ని కొంతైనా ఉపయోగించుకోవాలని ఉంది. మీకూ కొంత ఆదాయం వచ్చేలా చేస్తాను. నాకూ కాస్త సర్క్యులేషన్ బాగుంటుంది'' అని అడిగితే సరేనన్నాడు. నోట్లో ఉన్న తన కథలు చెప్పడానికేం భాగ్యం అనుకున్నాడు. బసవరాజుకి కథలు చెప్తూ కాలక్షేపం చేసేవాడు కనకరాజు.

ఒక రోజు బసవరాజు ఒక పత్రికను తెచ్చి కనకరాజు గారికి చూపిస్తూ ''ఇదిగో మీరు చెప్పిన కథ మన పత్రికలో అచ్చు వేయించా''నంటూ చూపించాడు.

పత్రికని పరికించి చూశాడు కనకరాజు. తను చెప్పిన కథ అక్షరం పొల్లుపోకుండా బాగానే అచ్చు వేయించారు. అందంగా బొమ్మలు కూడా వేయించారు. చాలా బాగుంది అనుకున్నాడు.

తీరా రచయిత పేరు దగ్గర బసవరాజు పేరు చూసిన కథల కనకరాజుకి అనుమానం వచ్చి 'ఇదేమిటయ్యా బసవరాజూ! కథ అంతా బాగానే అచ్చు వేయించావు. కాని నా పేరుకి బదులు నీ పేరు పడిందేం! తారుమారయిందా?'' అంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

'నేను ముందే అడిగానుగా మీరు నా దగ్గర ఘోస్టు రైటరుగా ఉంటారా అని' అన్నాడు బసవరాజు ముఖం చిట్లిస్తూ.

అప్పుడు అర్థమయింది కనకరాజుకి ఘోస్టు రైటరంటే ఏమిటో!

రచ్చబండ మీద మహారాజులా వెలిగిన కథల కనకరాజుని ఈ పరిణామం మాత్రం విలవిల లాడించింది. కథల కనకరాజు ఇంక ఈ లోకానికి కనపడడా అన్న దిగులుతో దిగాలుపడిపోయాడు.

తన సర్వశక్తుల్నీ తన ప్రమేయం లేకుండా గుండెల్లోంచి ఎవరో దోచుకు పోతున్నట్టు అనిపించింది.

తన రచ్చబండ, ఆ రావిచెట్టూ కూడా కుప్పకూలి పోతున్నట్టు మనస్సులో తుఫానుహోరు వినిపించింది. అంతే కథల కనకరాజు కుప్పకూలిపోయాడు అక్కడే.

కనకరాజు కథ కూడా కంచికి చేరిపోయింది.

★



## ధైర్యశాలి షారూక్



షారూక్‌ఖాన్ కాల్షీట్స్ దొరకడం ఎంత కష్టమో ముంబై ప్రొడ్యూసర్లని అడిగితే చెబుతారు. పాపం, షారూక్‌ఖాన్‌కి అమెరికాలో డాక్టరు గారి అప్పాయింట్‌మెంట్ కోసం సంవత్సరం క్రితం ట్రై చేస్తే ఇప్పుడు దొరికింది. ప్రస్తుతం అప్పుడెప్పుడో తగిలిన కాలి దెబ్బకి ఆపరేషన్ చేయించుకోడానికి అమెరికా వెళ్ళాడు షారుక్. మొత్తానికి ధైర్యశాలే!